వైఎస్సార్ సున్నా వడ్డీతో ఊరట

- నియోజకవర్గంలో 4415 సంఘాలకు లబ్ధి
- రూ.4.59కోట్ల మేర డ్వాక్రా సంఘాల ఖాతాలకు జమ


సమావేశమైన డ్వాక్రా సంఘాల మహిళలు (ఫైల్)

వేముల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో డ్వాక్రా మహిళలకు ఊరట కలుగుతోంది. పులివెందుల నియోజకవర్గంలో 4415 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. బ్యాంకులో రుణాలు పొంది సకాలంలో రునాలను చెల్లించిన సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వర్తిస్తుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా నాల్గవ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నిధులను శుక్రవారం డ్వాక్రా సంఘాల ఖాతాలకు జమ చేశారు. పులివెందుల నియోజకవర్గంలో 4415 సంఘాలకు రూ.4.59 కోట్ల మేర లబ్ధి చేకూరుతోంది. డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం అమలు చేస్తున్నారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి చివరి వరకు వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులను జమ చేశారు. డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం బ్యాంక్ ద్వారా విరివిగా రుణాలను మంజూరు చేస్తున్నారు. ఈ రుణాలతో మహిళలు చిన్న, చిన్న వ్యాపారాలు, పాడి పశువుల పెంపకం, వస్త్ర వ్యాపారాలు నిర్వహించుకుంటున్న డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వరమని చెప్పవచ్చు. సకాలంలో రుణాలు చెల్లిస్తున్న సంఘాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయడంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటోంది. ఎంతోమంది మహిళలు చిన్న, చిన్న కిరాణా షాపులు, ఇళ్ల వద్దనే వస్త్ర దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. డ్వాక్రా సంఘాలకు రుణాల మంజూరులో ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళలను పట్టించుకోలేదు. సున్నా వడ్డీ పథకం కూడా అమలు చేయకపోవడంతో మహిళలు అప్పులలో కూరుకుపోయారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన మేరకు వరుసగా నాల్గవ సారి ఏడాది కూడా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నిధులను డ్వాక్రా సంఘాలకు జమ చేయడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం అమలుతో బ్యాంకులో తీసుకున్న రుణాలను బ్యాంకులకు కాలంలో చెల్లిస్తూ ఆర్థిక ఇబదులను అధిగమిస్తూ బలోపేతం అవుతున్నారడంలో ఎటువంటి సందేహం లేదు.

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వివరాలు

మండలం	గ్రూపులు	వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం మొత్తం (రూపాయాల్లో)
పులివెందుల	282	రూ.44.71లక్షలు
వేముల	609	రూ.86.85లక్షలు
వేంపల్లె	1185	రూ.1.69కోట్లు
తొండూరు	495	రూ.66.89లక్షలు
సింహాద్రిపురం	628	రూ.91.20లక్షలు
లింగాల	591	రూ.88.61లక్షలు
చక్రాయపేట	625	రూ.88.54లక్షలు

సచివాలయ సిబ్బంది తొలగింపు

పులివెందుల టౌన్ : పులివెందుల నియోజకవర్గంలో ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలనలో నిర్లక్ష్యం వహించిన బీఎల్‌ఓలైన వార్డు అమెనిటీ సెక్రటరీ అజయ్‌కుమార్‌రెడ్డి, గోటూరు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అగడూరు డిజిటల్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి, వేంపల్లె ఎంపీఈఓ వి.రాధలను విధుల నుంచి తొలగించినట్లు మండల తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి తెలిపారు.

ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి

వీరపునాయునిపల్లె : బీఎల్వోలు, సూపర్‌వైజర్‌లు గ్రామాల్లో ఇంటింటి సర్వే వేగవంతం చేయాలని కమలాపురం నియోజకవర్గ ఆర్‌ఓ చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్‌లు, కార్యాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024కు సంబంధించి ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, అలాగే ఒక పోలింగ్‌స్టేషన్ నుంచి మరొక పోలింగ్‌స్టేషన్‌కు ఓటు బదిలీ వంటి వాటిని 21వ తేదీలోపు యాప్‌లో పొందు పరచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, బీఎల్వోలు, సూపర్‌వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

తమలపాకుల అలంకరణలో వాసవీమాత



పులివెందుల టౌన్ : పట్టణంలోని అమ్మవారిశాలలోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారిని శుక్రవారం ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో తమలపాకులతో విశేషంగా అలంకరించారు. అధిక శ్రావణ మాస నాల్గవ శుక్రవారాన్ని పురస్కరించుకుని విశేష అలంకరణతోపాటు దీపాలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మాధవీలత, సభ్యులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత


టైర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : దోమల నియంత్రణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కడప రోడ్డులో డ్రై డే – ఫ్రై డే సందర్భంగా టైర్ల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగ ఆయన టైర్లలో ఉన్న నీటి నిల్వలను పారిశుధ్య సిబ్బందిచే తొలగించి దోమల నివారణ చర్యలను చేపట్టాలన్నారు. మళ్లీ ఈ విధంగా టైర్లలో నీటి నిల్వ ఉంచితే జరిమానా విధించి టైర్లను స్వాధీనం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్ కుమార్, శానిటరీ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం పంపిణీ

చెన్నూరు : మండలంలోని రామనపల్లిలో మన్నూరు కాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు వైఎస్సార్ సీపీ నాయకులు రామనచంద్రమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శాంతమ్మ, డిజిటల్ అసిస్టెంట్ సుధీర్‌లు శుక్రవారం అందజేశారు.

పెద్దకుడాల మూడో వార్డు ఏకగ్రీవం

లింగాల : మండలంలోని పెద్దకుడాల గ్రామ పంచాయతీ పరిధిలోని మూడో వార్డుకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. మూడో వార్డుకు సంబంధించి ఎస్సీ జనరల్‌కు కేటాయించడం జరిగింది. నామినేషన్ల పర్వం ముగిసిందని.. గంగిరెడ్డి నాగేష్ అనే వ్యక్తి ఒక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారని.. దీంతో ఆ వార్డు మెంబర్ ఏకగ్రీవంగా ఎంపిక కానున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని వినతి

కొండాపురం : మండలంలోని పొట్టిపాడు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని మండల ఇన్‌చార్జి ఆర్‌ఐ ఆనంద్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసులు అందజేసి మాట్లాడారు. గ్రామంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన నరసింహులు ఈ భూమి మాది మా పెద్దలు మీకు ఎప్పుడో ఇచ్చారు కానీ ఇప్పుడు ఈ భూమిని మీకు శ్మశానానికి ఇచ్చేదానికి వీలు పడదని ఆ భూమిని వేరేవారికి అమ్ముకున్నాను అని చెప్పాడని దళితులకు న్యాయం చేయాలని కోరడంతో తప్పకుండా పరిశీలించి న్యాయం చేస్తామని రెవెన్యూ అధికారి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

మత్స్యకారులకు సబ్సిడీతో వలలు పంపిణీ

కొండాపురం : శ్రీ గంగా భవాని మత్స్య ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని దత్తాపురం, చౌటిపల్లె గ్రామాలలోని 25 మంది మత్స్యకారులకు 50 శాతం సబ్సిడీతో వలలను మత్స్యశాఖాధికారి నాగలింగాచారి అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు సబ్సిడీతో ఇచ్చిన వలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు, ఎఫ్ డీఓ మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కమలాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో రెండవ శనివారం కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎస్ ఏఈ చాంద్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ కారణంగా ఈ కోతలు విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిబంధనల ప్రకారం రీసర్వే నిర్వహించాలి


నాగూరు గ్రామంలో భూముల రీసర్వేని పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్, రెవెన్యూ అధికారులు

వేంపల్లె : ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల సమక్షంలో భూమి రీసర్వే నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేంపల్లె మండలం నాగూరు గ్రామ పొలాల్లో అధికారులు నిర్వహిస్తున్న భూముల రీసర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వారి వారి హద్దులను ఏర్పాటు చేసి పక్కాగా సర్వే చేపట్టాలని.. ఒకవేళ ఒక సర్వే నెంబర్ భూమి మరొకరు సాగి ఉంటే అందుకు సంబంధించి వారు ఒరిజనల్ డాక్యుమెంట్లు తీసుకొచ్చి రెవెన్యూ అధికారులతో సరి చూసుకోవాలని తెలిపారు. ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

– ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో రేపు ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు.

ఉచిత షుగర్ పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలి


జాతీయ పతాకాలతో ర్యాలీ చేస్తున్న సిబ్బంది

కమలాపురం : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలని ప్రొద్దుటూరు సౌత్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఆయన పోస్టల్ సిబ్బందితో కలసి జాతీయ జెండాలు చేతబట్టి హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాలను విక్రయిస్తున్నామని, దీని ధర కేవలం రూ.25 మాత్రమేనని ఆయన తెలిపారు. కావలసిన వారు పోస్టాఫీసుకు వచ్చి జాతీయ పతాకాన్ని కొనుగోలు చేసుకోవచ్చన్నారు. స్వాతంత్ర్యం దినోత్సవం నాటికి ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ బాలశివకుమార్, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి


అచ్చివెళ్లిలో మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారులు, తదితరులు


వల్లూరు : మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎంపీడీఓ జుబేదా

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అటవీ శాఖాధికారి గోపాలకృష్ణయ్య, ఏపీఓ పుష్పలతలు కోరారు. మేరా మేటీ – మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా అచ్చివెల్లి గ్రామంలో బ్లాక్ ప్లాంటేషన్‌లో సుమారు 240 మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ రక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ అజయ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్, గ్రామస్తులు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : ప్రతి ఒక్కరూ తమ పరిధిలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ జుబేదా తెలిపారు. శుక్రవారం మేరే మిట్టి–మేరే దేశ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లేబాక, కుమారునిపల్లె, తోలగంగన్నపల్లె, అంబవరం, కొప్పోలు గ్రామాల్లో నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అనంతరం మొక్కలు నాటి వాటికి నీళ్లు పోశారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆజాదీకా అమృత్ మహోత్సవంలో సర్పంచ్ అంకాలమ్మ, ఎంపీడీఓ సురేంద్రనాథ్‌లు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధులకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఉమ్మడిశెట్టి సురేష్‌బాబు, కొమ్మద్ది రామాంజనేయులు, సర్పంచ్ అంకాలమ్మ, ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి, స్నేహిత అమృతహ హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజులను ఎంపీడీఓ సురేంద్రనాథ్, పంచాయతీ సెక్రటరీ వరలక్ష్మిల చేతులమీదుగా శాలువాలతో ఘనంగా సత్కరించారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నా భూమి– నా దేశం కార్యక్రమాన్ని శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ సీహెచ్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈనెల 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా పర్యావరణ కొరకు పాటుపడాలన్నారు. అనంతరం వారు రాచినాయపల్లెలోని అమృత సరోవర్ చెరువుగట్టు పైన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగనపల్లి సురేష్‌బాబు, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, సర్పంచ్ సొట్టం నారాయణరెడ్డి ఉపాధి హామీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలో అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి

కమలాపురం : అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలను పాత పద్ధతిలోనే నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలతో భూ దందాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం స్పందించి పాత పద్ధతిలోనే అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. భూ దందాలను అరికట్టి నిజమైన లబ్ధిదారులకు భూ పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈనెల 14వ తేదీన జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి అసైన్‌మెంట్ లబ్ధిదారులు హాజరై విజయ వంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు నాని, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తా

ఎర్రగుంట్ల : తనపై నమ్మకం ఉంచి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించుటకు సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి నమ్మకం వమ్ము చేయకుండా వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.సుభాన్‌బాషా అన్నారు. శుక్రవారం నిడుజివ్వి గ్రామంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి


స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఆగస్టీన్‌రాజ్

జమ్మలమడుగు : ప్రతి విద్యార్థిని ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని కోసం ఇష్టపడి చదువుకోవాలని సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.ఆగస్టీన్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న బాలికల జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ హనుమంతరావు అధ్యక్షతన క్యాంబెల్ ఆసుపత్రి తరపున విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. డాక్టర్ ప్రత్యూష, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో నిరసన


ఆర్టీపీపీలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని ప్రధాన గేటు బయట ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు కార్పొరేషన్ నుంచి కాకుండా నేరుగా యాజమన్యాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన జరిగిన జేఏసీకి ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందంను రద్దుచేయాలని ఈ ఒప్పందంలో కార్మికులకు నష్టం జరిగేలా ఉందన్నారు. 9వ తేదీన జరిగిన వేతన ఒప్పందాన్ని వ్యతిరేకి స్తున్నామన్నారు. ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

వీఎన్‌పల్లె ఎస్ఐగా కుల్లాయప్ప



వీరపునాయునిపల్లె : వీరపునాయునిపల్లె ఎస్ఐగా కుల్లాయప్ప శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్క డ పనిచేస్తున్న లక్ష్మినారాయణ సిద్దవటంకు బదిలీ అవడంతో కడప హెడ్‌క్వార్టర్ నుంచి కుల్లాయప్ప ఇక్కడికి బదిలీ అయ్యారు. ప్రజలు గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాల గడప.. ఏపీ

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సంక్షేమ పథకాల గడప ఆంధ్రప్రదేశ్ అని, ప్రపంచంలో ఎక్కడా లేనన్ని పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని అది కేవలం జగనన్న సీఎం కావడంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం మండలం అప్పారావుపల్లె, నసంతపురం గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయా గ్రామాల నాయకులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, డ్రైనేజ్, విద్యుత్ స్తంభాలు, వాటర్ ప్లాంట్ కావాలని ప్రజలు కోరడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించారు. ఇంకా పథకాలు రానివి ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు. మీ సమస్యలు తెలుసుకోవడానికే జగనన్న మమ్మల్ను మీ వద్దకు పంపారన్నారు. అర్హులుగా ఉన్నప్పటికీ ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ సంక్షేమ పథకాలకు కేరాఫ్ అన్నారు. ఏపీలో అమలవుతున్నన్ని పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అవ్వా తాతలకు ఇస్తున్న పింఛన్ రూ.2750, అమ్మ ఒడి దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. పుట్టిన బిడ్డ మొదలుకుని పండుటాకుల వరకు అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తున్న ఏకై క సీఎం జగనన్న అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిశంకర్, కుంచం శ్రీనివాసులరెడ్డి, సతీష్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, మల్లికార్జునరెడ్డి, అయ్యవార్‌రెడ్డి, సందా ప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, చెన్న చేశవరెడ్డి, కొండారెడ్డి, నిఖిల్‌రెడ్డి, మస్తానయ్య, ఇందిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, యల్లారెడ్డి, రామసుబ్బారెడ్డి, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ మహిళకు చికిత్స


గాయపడిన మహిళలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి వైద్యం అందించారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఓ మహిళను వాహనం ఢీకొనడంతో గాయపడింది. ఆ సమయంలో అదే మార్గంలో వెళుతున్న ఎమ్మెల్యే కారు దిగి గాయపడిన మహిళను సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి ఆయనే స్వయంగా వైద్యం అందించారు.

నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడే కానీ నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా విధులు నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సచివాలయ అమెనిటీ సెక్రటరీ, నీటి సరఫరా సిబ్బందితో కలిసి ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అక్రమ కొళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించమని ఇప్పటికే పలుమార్లు సిబ్బంది సూచించామన్నారు. కానీ ఇంతవరకు సదరు కార్యక్రమ పురోగతిని తన దృష్టికి తీసుకరాలేదన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీరు ఏక్‌నాథ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేంపల్లె : పట్టణంతోపాటు మండల పరిధిలోని తాళ్లపల్లె, గిడ్డంగివారిపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 7.45గంటల నుంచి ఉదయం 11.45గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ జేఈలు చంద్రశేఖర్, శివలు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ఎర్రగుంట్ల : మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ నందు మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందన్నారు.

సాగులో ఉన్న ప్రతి పంట నమోదు చేయాలి


ఎస్.పాలగిరిలో పంటనమోదును పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె : ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటను నమోదు చేయాలని మండల వ్యవసాయ శాఖాధికారి శ్యామ్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్.పాలగిరి గ్రామంలో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు ఎటువంటి పొరపాట్లు జరగకుండా చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామ మ్యాపులో సర్వే నెంబర్లను గుర్తించి నమోదు చేయాలన్నారు. పంట నమోదు యాప్‌లో కొత్తగా సర్వే నెంబరు, సరిహద్దులు చేరుకున్న తరువాత మాత్రమే కెమెరా ఓపెన్ అవుతుందని జియో కోఆర్డినేట్స్ ఆధారంగా పంట నమోదు జరుగుతుందని తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులు తప్పని సరిగా 1బి, ఆధార్‌కార్డు తీసుకెళ్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రబీ సాగుపై రైతులకు అవగాహన సదస్సు

సింహాద్రిపురం : స్థానిక సచివాలయంలో శుక్రవారం ఉద్యాన శాఖ రాష్ట్ర మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహాదారుడు అరవిందనాథ రెడ్డిల ఆధ్వర్యంలో రైతులకు రబీ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రైతులు ఏ ఏ పంటలు ఎప్పుడు సాగు చేసుకోవాలి.. అలాగే వర్షాలను బట్టి పంట కాలం గమనించి ఆ కాలంలో ఏ పంట సాగు చేసుకోవాలో వివరించారు. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా ఎరువులను సరఫరా చేశామని.. అలాగే డ్రోన్ల సహాయంతో రసాయన మందులు ఎలా పిచికారి చేయాలో డెమో ద్వారా చూపించాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో ముద్దనూరు ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏఓ శివమోహన్ రెడ్డి, సచివాలయ, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

చెన్నూరు : రైతులు ప్రత్యామ్నాయ పంటలైన మినుము పెసర, జొన్న పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి తెలిపారు. చెన్నూరు రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు అధ్యక్షుడు ఎర్రసాని మోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కేసీ కెనాల్‌కు సాగునీరు అందించే విషయమై కేసీ కెనాల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలు మినుము, పెసర, జొన్న విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్–2023 పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, రైతులు పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, జీఎన్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

వల్లూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో పంటలు సాగు చేసిన రైతులు తమ పంటల వివరాలను ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం వల్లూరులో మొదటి రోజు ఏడీఏ పర్యవేక్షణలో వ్యవసాయ సిబ్బంది ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేశారు. ఈ సారి జియో కోఆర్డినేట్స్‌తో కలసి బుకింగ్ చేయాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ చేయాల్సిన సర్వేలోకి వెళ్లినపుడు మాత్రమే మొబైల్ కెమెరా ఓపెన్ అవుతుందన్నారు. ముందు రోజే రైతులకు సమాచారం అందించి క్షేత్ర స్థాయికి వెళ్లాలన్నారు. చిన్న తప్పిదాలకు కూడా తావివ్వకుండా పంట నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సాయిజ్యోతి, ఏఈఓ మౌనిక, వీఏఏ సురేఖ, రైతులు పాల్గొన్నారు.